వార్త
బుధవారం 12 ఆగస్టు 2026
I

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# సత్యవేడుకు దిక్కెవరు 'బాబు'!

## నాయకత్వం కరువై వర్గపోరుతో కార్యకర్తల్లో గందరగోళం

సత్యవేడు, ఆగస్టు 11ప్రభాతవార్త బృందం:

తిరుపతి జిల్లాలో కీలకమైన సత్యవేడు నియోజకవర్గంలో అధికార తెలుగుదేశం పార్టీకి నాయకత్వం కరువై పార్టీ శ్రేణులకు దిక్కెవరనే పరిస్థితిలో కొట్టుమిట్టాడుతు న్నారు. రొట్టె ముక్కకోసం రెండు పిల్లులు కొట్లాడుకుని కోతికి అవకాశం దక్కిం దనే చందంగా అధికారమిచ్చిన కార్య కర్తలనేగాక నియోజకవర్గ ప్రజలను కూడా విస్మయానికి గురిచేస్తున్నారు. సమర్ధవంతమైన నాయకత్వం లోపించడంతో పార్టీ కార్యకర్తలు గందరగోళంలో ఉన్నారు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంలోని టిడిపి అధిష్టానం ఇక్కడి పరిస్థితులను చక్కదిద్దాల్సి ందిపోయి సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను కాదని శంకర్‌రెడ్డిని తీసుకురావడం, ఆయన స్థానిక నేతలతో సఖ్యతగా లేకపోవడంతో అసలు సమస్య తలెత్తింది. పార్టీలో పెత్తనం చేస్తున్న ఓ నేత పార్టీ శ్రేణులను పూర్తిగా విస్మరించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కొద్దిరోజుల క్రిందట శ్రీసిటీలో అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు, ప్రారంభోత్స వాలకు విచ్చేసిన సిఎం చంద్రబాబునాయుడు స్థానికంగా ఓరోజు కేటాయించారు. ఆ రోజు నియోజకవర్గ ముఖ్య నేతలు, స్థానిక ఎమ్మెల్యేతో సమావేశమై ఒకే తాటిపై నడిచి పార్టీ ప్రతిష్ట కాపాడాలని గట్టిగా నిర్ధేశించినా ఇక్కడ నేతల్లో పరిస్థితులు ఏ మాత్రం మార్పురాలేదు. గత ఎన్నికల్లో సత్యవేడులో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్దికాలంలోనే ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దురదృష్టవశాత్తు ఓ మహిళ ఆరోపనలతో పార్టీ సస్పెండ్ చేసినా ఆ తరువాత ఆయన వ్యక్తిత్వంపై పార్టీకి ఒక సందేశం చేరింది. దీంతో ఆయనను పార్టీలో కొనసాగిస్తున్నా మధ్యలో శంకర్‌రెడ్డిని ఇన్‌ఛార్జిగా తేవడంతో అందుకు భిన్నంగా మారింది. సత్యవేడు నియోజకవర్గ టిడిపి పరిశీలకులుగా చంద్రశేఖర్ నాయుడు, ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్‌గా శ్రీపతిబాబులను పంపి పార్టీ పరిస్థితులను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. స్థానికేతరులకు పార్టీ పగ్గాలు ఇచ్చి తెలుగు తమ్ముళ్ళకు, నియోజకవర్గ ప్రజలకు అన్యాయం చేస్తున్నారనే అంశాన్ని కొందరు సీనియర్ నేతలు అసంతృప్తి వ్యక్తం చేయడం విశేషం. ఏళ్ళ తరబడి పార్టీని నమ్ముకుని ఉన్న సీనియర్ నేతలు, పార్టీ శ్రేణులను పక్కనపెట్టి తన సోదరుడైన వైసీపీ వలస దారుడు కూరపాటి చంద్రశేఖర్‌రెడ్డికి పార్టీలో ప్రాధాన్యత కల్పించడం, వన్‌మ్యాన్ షోగా వ్యవహరించడం సీనియర్ నేతలకు నచ్చడంలేదు. అయినా పార్టీ అధిష్టానం ఆదేశాలంటూ నయానో బయానో కార్యక్రమాల్లో పాల్గొన్నప్పటికీ పూర్తి స్థాయిలో శంకర్‌రెడ్డికి పార్టీ నేతలు సహకరించకపోవడానికి రాజకీయ అనుభవం లేకపోవడమే కారణంగా తెలుస్తోంది. రాత్రింబళ్లు ఎర్రమట్టి టిప్పర్లు ఎర్రమట్టిని తరలిస్తూ ఇక్కడ సహజసంపదలను పక్క రాష్ట్రానికి దోచిపెట్టేస్తున్నారనే బలమైన ఆరోపణలు లేకపోలేదు. పార్టీలో సీనియర్లను, పార్టీ శ్రేణులను కలుపుకుని పనిచేయడంలో ఆయన ఏమాత్రం సాహసం చేయడంలేదనే పార్టీ వర్గాలు బహిరంగంగా వ్యాఖ్యలు చేస్తున్నాయి.

## డిఎస్పీకి ఎమ్మెల్సీ భరత్ ఫిర్యాదు

కుప్పం, ఆగస్టు 11 ప్రభాతవార్త



కుప్పంలోని తన క్యాంప్ కార్యాలయంపైకి దాడి చేసేందుకు కూటమి నేతలు ప్రయత్నిం చడంతో పాటు తన తల్లిని నానా దుర్భాషలాడి రాయలేని పదజాలంతో దూషించిన వ్యక్తి మల్లానూరు పంచాయతీ ఉవ వ్వప్ప కొటాలుకు చెందిన ఏకనాథంపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ కుప్పం డిఎస్పీ పార్థసారథికి ఎమ్మెల్సీ, కుప్పం వైకాపా ఇన్‌చార్జ్ భరత్ స్వయంగా ఫిర్యాదు చేశారు. డిఎస్పీ కార్యాలయంకు ఆయన నేతలతో కలసి చేరుకుని డిఎస్పీకి ఫిర్యాదును అందించారు.

# తిరుపతి నగరంలో అరకొర రక్షణే!!



### -వర్కింగ్ హాస్టళ్ళ ప్రాంతాల్లో ....విద్యాసంస్థల కూడళ్ళలో పోకిరీల ఆగడాలు
### -శక్తి టీమ్ సరే...గస్తీ కనిపించని పోలీసులు

ప్రభాతవార్త-తిరుపతి:

తిరుపతి నగరంలో యువతులకు ముఖ్యంగా విద్యార్థినులకు అరకొర రక్షణగా సెక్యూరిటీ వ్యవహారం తయారైంది. పేరుకే మహిళ పోలీసులతో శక్తిటీమ్ గస్తీ తిరుగుతున్నట్లు పోలీసు అధికారులు ప్రకటన చేస్తున్నా ఆచరణలో మాత్రం విఫలమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. తిరుపతి నగరంలో నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు స్వయంగా జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు కఠినంగా చర్యలు తీసుకుని డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచడమేగాక నగరంలోని ప్రధాన కూడళ్ళలో ఆధునిక సిసికెమెరాల నిఘా కూడా ఏర్పాటుచేయించారు. ఇదంతా పైకి షోలా మారిందనే విమర్శలు నగరజనం నుండి వ్యక్తమవుతోంది. తిరుపతినగరంలో ప్రధాన కూడళ్ళలో, విద్యాసంస్థలు,జూనియర్ కళాశాలలతో బాటు ప్రైవేట్ విద్యాసంస్థలు,టిటిడి జూనియర్ కళాశాలలు, బాలాజీనగర్, వెస్ట్‌చర్చి ప్రాంతం, ఎస్వీపాలిటెక్నిక్ కళాశాల సమీపంలో,భవానీనగర్ కూడలి, టిటిడి పరిపాలన భవనం పక్కన మాస్టర్‌ప్లాన్ రోడ్డు కూడలి ,బజారువీధి, చిన్నకాపువీధి కూడలి, తాతానగర్ కూడలి, కొర్లగుంట,లీలామహల్ కూడలి,ఎస్వీనగర్ ,పద్మావతి జూనియర్ కళాశాల మార్గంలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో కొందరు యువకులు, పోకిరీలు టీ షాపుల వద్ద, బజ్జీబోండాల అంగళ్ళవద్ద, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల వద్ద తిష్టవేసి దారిన వెళ్ళే యువతులు, విద్యార్థినుల పట్ల కామెంట్లు చేయడం, సైగలు చేయడం,ఏకంగా వాహనాల్లో వెంబడించడం వంటి ఘటనలకు పాల్పడుతున్నారని విద్యార్థినుల తల్లిదండ్రులు, నగరజనం ఆవేదన చెందుతున్నారు. ఇటీవల రాజమండ్రిలో వైద్యురాలు డాక్టర్ ప్ర ి యాంక ఘటనతో అమ్మాయిలు, విద్యార్థినుల, యువతుల తల్లి దండ్రుల్లో పోకిరీల ఆగడాలు ఆందోళన కలిగిస్తోంది. తిరుపతిలో మహిళ పోలీసులతో శక్తి టీమ్ పేరుతో ప్రత్యేక బలగాలను ఏర్పా టుచేసి ప్రతి పాఠశాల, కళాశాలలో బ్యాడ్‌టచ్ గుడ్ టచ్ గురించి అవగాహన కల్పిస్తున్నా బహిరంగంగా రోడ్లపైన, ప్రధాన కూడళ్ళ వద్ద పోకిరీలపై పోలీసుల నిఘా కొరవడిందనే విమర్శలు బలంగా ఉన్నాయి. అత్యవసరమైతే యువతులు, విద్యార్థినులు 112కి ఫిర్యాదు చేయాలని సూచనలు చేస్తున్నా రోడ్లపై అల్లరిమూకలు, పోకిరీల చేష్టలకు బ్రేక్ వేయలేకపోతున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తు న్నాయి. పోలీసులు కఠినంగా వ్యవహరించి చర్యలు తీసుకుంటే ఇలాంటి ఘటనలు పునరావృతం కావనే వాదనలు లేకపోలేదు. ఎక్కడైనా రోడ్లపై పోకిరీల ఆగడాలు గురించి పోలీస్‌స్టేషన్‌లకు ఫిర్యాదు చేసినా రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని ఉచిత సలహాలివ్వడం మరీ ఒకింత అంతర్మథనం చెందుతున్నారు. తిరుపతి నగరంలో చాపక్రిందనీరులా జరిగిపోతున్న పోకిరీలు, అల్లరిమూకల ఆగడాలకు పోలీసులు మఫ్టీలో గస్తీ పెట్టి చర్యలు తీసుకుంటే తప్ప అడ్డుకట్టపడదనేది నగరజనం మాట. ఏకంగా తిరుపతి నగరంలో అనేక కూడళ్ళలో ,ముఖ్యంగా వర్కింగ్ హాస్టళ్ళ పరిసరాల్లో యువతులు,విద్యార్థినుల భద్రతకు భంగం కలిగిస్తూ టీషాపులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ ప్రాంతాల్లో అసభ్యంగా ప్రవర్తించే ఆకతాయిలు, వీధి పోకిరీలపై పోలీసులు నిఘా పెంచి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుకొంటున్నారు. ఇటీవల కాలంలో సామాజిక మాధ్యమాల ద్వారా యువతులు, మహిళలతో పరిచయాలు పెంచుకుని వారిని బ్లాక్‌మెయిల్ చేస్తున్న ఘటనలపై పోలీసులు తీవ్రంగా కొరఢా ఝుళిపిస్తున్నారు.

# ప్రజల్లో వ్యతిరేకత తట్టుకోలేక ఫ్రస్టేషన్ చూపుతున్నారు : ఎమ్మెల్సీ భరత్

### నా తల్లిని ..కుటుంబాన్ని తిడతారా.. కుప్పంలో కొత్త సంస్కృతి తెచ్చారా..?
### ఓ కొడుకుగా మాట్లాడుతున్నా.. డిసిఎం పవన్..మంత్రి లోకేష్ సమాధానం చెప్పాలి!!

కుప్పం, ఆగస్టు 11 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక ఆయా పార్టీల నేతలు ఫ్రస్టేషన్‌ను ప్రతిపక్ష ంపై చూపుతున్నారని ఎమ్మెల్సీ, కుప్పం వైకాపా ఇన్‌చార్జ్ భరత్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిఎస్పీ అక్రమాలపై తమ పార్టీ ఆధారాలు బయటపెట్టిందని నిరుద్యోగులకు న్యాయం చేయాలని తాము నిరసనలు చేస్తున్నామన్నారు. కుప్పంలో సైతం నిరసన ర్యాలీకి పిలుపునిస్తే అధికార పార్టీ పోలీసు యంత్రాంగాన్ని తమపై ఉపయోగించిందన్నారు.నాలుగు మండలాల్లో కార్యకర్తలను ఎక్కడికక్కడ నిర్భంధించారన్నారు. చాలా మంది కార్యకర్తలు తమ ఇంటి వద్దకు గోడదూకి వచ్చారన్నారు. డిఎస్పీపై సిబిఐ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుచేసే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. సోమవారం కుప్పంలో తెదేపా,భాజపా నేతలు తమ కార్యాలయంపై దాడికి రావడం ఓ బిజెపి నేత తన తల్లిని అనరాని మాటలు అన్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కుప్పంలో కొత్త నీచ సంస్కృతిని తెచ్చారా అని ప్రశ్నించారు. తాను ఓ కొడుకుగా అడుగుతున్నానని సనాతనధర్మం గురించే మాట్లాడే డిసిఎం పవన్ కళ్యాణ్, మహిళల్ని గౌరవించాలని చెప్పే మంత్రి నారా లోకేష్ ఈ అంశంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తనతండ్రి విశ్రాంత ఐఎఎస్ అధికారి అని తమ కుటుంబం 12 ఏళ్లుగా కుప్పంలోనే ఉందని పార్టీల మధ్య విభేధాలు ఉండవచ్చేగానీ రాజకీయాల్లో మహిళల్ని తెచ్చి రాజకీయాలు చేయడం దారుణమన్నారు. మీ ఇళ్లల్లో వారిని తిడితే మీరు బాధపడరా అని ప్రశ్నించారు. కుప్పంలో ఇలాంటి నీచభాషలు వద్దని పేర్కొన్నారు. తన తల్లి ఏనాడు ఎవరి చెడుకోరలేదన్నారు. తన తల్లిని దూషించిన అంశంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో మండల కన్వీనర్లు హెచ్‌ఎం మురుగేష్, బాబురెడ్డి, దండపాణి, రామకృష్ణ, కౌన్సిలర్లు మోహన్‌రాం, మునిరాజు, రాష్ట్ర వన్నియకులక్షత్రియవిభాగం అధ్యక్షుడు హెచ్‌ఎం శ్రీను, ప్రచార కార్యదర్శి జివి రమేష్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.



కుప్పంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

## జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమీక్ష

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 11 ప్రభాతవార్త :

ఏపీ సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలపైన ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ ,రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (స్పెషల్ సీఎస్) జి. జయలక్ష్మి తో కలసి వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ సమీక్షా సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. అలాగే రాష్ట్ర సచివాలయం నుండి 22 ఏ,వెబ్ ల్యాండ్, రీ సర్వే, పట్టా దారు పాసు పుస్తకాల పంపిణీ, రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్, పి జి ఆర్ ఎస్, ఓ ఆర్ సి ఎం ఎస్ ఫారెస్ట్ భూములపై సమీక్షా తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు లతో ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (స్పెషల్ సీఎస్) జి. జయలక్ష్మి తో కలసి వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర సచివా లయం నుండి భూపరిపాలన, రెవెన్యూలకు సంబందించి 22 ఏ,వెబ్ ల్యాండ్, రీ సర్వే, పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ, రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్,పి జి ఆర్ ఎస్, ఫారెస్ట్ భూముల తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ నిర్వహించగా జిల్లా నుండి జిల్లా కలెక్టర్ డా, ఎస్. వెంకటేశ్వర్, ఈ వీడియో కాన్ఫిరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీఓలు రామ్మోహన్, బానుప్రకాష్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భరత్ నాయక్ , రామాంజనమ్మ , ల్యాండ్ అండ్ సర్వే అధికారి రాంప్రసాద్, సెక్షన్ సూపరింటెండెంట్స్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్

### తప్పిదాలు సరిదిద్దితే
# మాతృ మరణాలు కట్టడి
### - కలెక్టర్ సుమిత్‌కుమార్



చిత్తూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త:

మాతృ మరణాలకు దారితీస్తున్న కారణాలను గుర్తించి, అందులోని లోపాలను సకాలంలో సరిదిద్దితే మాతృ మరణాలను నివారించవచ్చునని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. మల్లనూరు, గంగవరం పిహెచ్‌సిల పరిధిలో గతంలో జరిగిన మాతృమరణాలపై అధికారులు, వైద్యులు, సిబ్బందితో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాతృ మరణాలకు దారి తీసిన పరిస్థితులు, వైద్య సేవల అందుబాటు, క్షేత్ర స్థాయిలో తీసుకున్న చర్యలను పరిశీలించారు. గర్భధారణ జరిగిన వెంటనే గర్భిణులను గుర్తించి నమోదు చేయడంతో పాటు, గర్భాధారణ సమయంలో అవసరమైన వైద్య పరీక్షలు, స్కానింగ్, రక్తపరీక్షలు, పౌష్టికాహారం సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి నిరంతరం పర్యవేక్షించాలని, అత్యవసర పరిస్థితుల్లో ఆలస్యం చేయకుండా మెరుగైన వైద్య సదుపాయాలున్న ఆసుపత్రులకు తరలించాలని ఆదేశించారు. గర్భిణుల వివరాలను ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పూర్తి కచ్చితత్వంతో నమోదు చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పద్మాంజలి దేవి, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ లత, డాక్టర్ అనూషతో పాటు వివిధ ఆసుపత్రులకు చెందిన వైద్యులు, పిహెచ్‌సి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాల విజయవంతంకు కృషి చేయాలి

కాణిపాకం, ఆగస్టు 11 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో జరుగనున్న 2026 స్వామివారి వార్షిక బ్రహ్మోత్స వాలను అంరంగ వైభవంగా నిర్వహించడానికి ఆలయ అధకారులు, సిబ్బంది సహకరించాలని ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు,ఈఓ కె.పెంచల కిషోర్‌లు అన్నారు. సెప్టెంబర్ 14 నుండి దేవస్థానంలో జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్స వాల ఏర్పాట్లపై మంగళవారం స్థానిక ఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది, ఇంజనీరింగ్ శాఖ, అర్చకులు, వేదపండితులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 14 నుండి అక్టోబర్ 4న వరకు జరిగే బ్రహ్మోత్స వాలను దిగ్విజయంగా నిర్వహించడానికి అధికారులు, సిబ్బంది సహకరించాలని తెలిపారు. అలాగే బ్రహ్మోత్స వాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈమేరకు బ్రహ్మోత్స వాల సందర్భంగా అన్నదానం, కౌంటర్ల నిర్వహణ, లట్టూపోటు నందు ప్రసాదం తయారీ, కూలైన్లు, బ్రహ్మోత్స వాల సందర్భంగా ఆర్జిత సేవల నిర్వహణ, ఛైర్మన్, ఈఓలు చర్చించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, స్థానాచార్యులు పణిస్వామి, ఆలయ ఏఈవోలు రవీంద్రబాబు, ప్రసాద్, ధనపాల్ ఎస్వీ.కృష్ణారెడ్డి, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, దివాకర్‌రెడ్డి, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.



## ఈ విద్యా సంవత్సరం నుంచి శ్రీకాళహస్తిలోని తరగతులు!

### -రూ.9కోట్లతో మరమ్మతులు,
### నేడు స్థల స్వాధీనం : ప్రిన్సిపల్ వెల్లడి



శ్రీకాళహస్తి,ఆగస్టు 11 ప్రభాతవార్త:

సుమారు ఏడేళ్ళ తరువాత మళ్ళీ శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా సుమారు 20 సంవత్స రాల పాటు నిర్వహించిన సరస్వతి నిలయం 7 సంవత్స రాలుగా మూతబడి, మళ్ళీ ఈ ఏడాది తరగతులు నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. గత ఏడాది కౌన్సె లింగ్‌లో స్కిట్‌కు అవకాశం కల్పించినా, కొన్ని అనివార్యకారణాలతో ఇక్కడ చేరిన విద్యార్థులు కలికిరిలోని అనంతపురం జేయన్‌టియులో చదవాల్సి వచ్చింది. అయితే బాలారిష్టాలు తొలగించుకొని ఈ ఏడాది శ్రీకాళహస్తిలోని మొదటి సంవత్స రం తరగతుల నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ దీర్ఘకాలంగా మూతపడ్డ కళాశాలను పునః ప్రారంభానికి సంబంధించిన భవనాల మరమ్మత్తులకు రూ.9కోట్లు కేటాయించి, పనులు ఓ సంస్థకు అప్పగించినట్లు ప్రిన్సి పల్ వెంకటేశ్వరరావు మంగళవారం ప్రభాతవార్తకు వివరించారు.

**నేడు భూముల రిజిస్ట్రేషన్‌కు సన్నాహాలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంకు అనుబంధంగా నిర్వహించిన స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల 2019 వైకాపా హయాంలో మూత పడింది. అయితే ఆ ప్రభుత్వంలో స్కిట్‌ను తిరిగి పున: ప్రారంభించుటకు చొరవ చూపలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత స్థానిక శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఉన్నత విద్యాశాఖా మంత్రి నారాలోకేష్‌ను పట్టుబట్టి అన్ని అనుమతులతో పాటు నిర్వహణకు మొదట నిధులుకూడా మంజూరు చేయించారు.అయితే జేయన్‌టియు అనంతపురం వారు 99సంవత్స రాల లీజుకు కోరారు. సుదీర్ఘ పరిశీలనల తరువాత 11 ఏళ్ళ లీజుకు అనుమతించారు. ఇక కళాశాలకు 50 ఎకరాల స్థలం ఉండగా 35 ఎకరాలనుమాత్రమే అప్పగించుటకు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో బుధవారం భూముల స్వాధీనం రిజిస్ట్రేషన్‌కు సన్నాహాలు చేస్తున్నారు.ఈ మేరకు అనంత జేయన్‌టియు వైస్ ఛాన్స లర్, ప్రిన్సి పల్‌లు రానున్నారు. అయితే దేవాదాయశాఖ నర్స రికికి ఇక్కడ నిర్వహిస్తున్న నర్సి ంగ్ పాఠశాలలను అప్పగించలేదు.

**కౌన్సెలింగ్‌లో విశేష స్పందన:**

శ్రీకాళహస్తిలోని అనంత జేయన్‌టియు కళాశాలలో ఈ ఏడాది ప్రవేశాలకు విద్యార్థుల నుంచి మంచి స్పందన వచ్చిందని ప్రిన్సి పల్ వెంకటేశ్వరరావు ప్రభాతవార్తకు వివరించారు. కళాశాలకు ప్రభుత్వం 330 సీట్లను కేటాయించగా విద్యార్థులు 227 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. రెండు రోజులుగా ఇద్దరు ఉద్యోగులను నియమించామని వారు కౌన్సె లింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నట్లు ప్రిన్సి పల్ వెంకటేశ్వరరావు తెలిపారు. అయితే సియస్‌సి డేటాలో 66 సీట్లు ఉండగా 28మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. త్రిబుల్ ఇలో 66 సీట్లుకు కేవలం 9 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు.ఇంకా 103 సీట్లు ఉన్నాయన్నారు. గత ఏడాది చేరిన వారి పరిస్థితిని ప్రభాతవార్త ప్రశ్నించినపుడు ఈ ఏడాది ఇక్కడ మొదటి సంవత్స రం క్లాసులుమాత్రమే ప్రారంభిస్తామన్నారు. అన్ని సదుపాయాలు కళాశాల పూర్తిస్థాయిలో మరమ్మతులు పూర్తి చేసుకుంటే అక్కడ విద్యార్థులను కూడా ఇక్కడకు పంపుతామన్నారు.

## వాసుయాదవ్ లొంగుబాటు



తిరుపతి క్రైమ్, ఆగస్టు 11, ప్రభాతవార్త

తిరుపతి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ జేబి శ్రీనివాస్ పై హత్యాయత్నంకు పాల్పడిన నలుగురిని నిందితులపై తిరుపతి రూరల్ పోలీసులు సంబంధిత కేసు నమోదు చేసిన విషయం విదితమే. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులు అరెస్టు కాగా నాలుగవ నిందితుడు వాసు యాదవ్ కోసం పోలీసులు గాలిస్తుండగా ఈ క్రమంలో వాసు యాదవ్ మంగళవారం తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్లో లొంగిపోయారు. అంతకు ముందుగా ఆయన కాణిపాకంలో కర్పూర వెలిగించి తాను ఎటువంటి హత్యాయత్నంకు ప్రయత్నించలేదంటూ ప్రమాణం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చేసినట్లు తనపై కేసు మోపిన వారు ప్రమాణం చేయగలర అని సవాలు విసిరాడు.

